7

సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



నమో నారసింహా
ఐఎస్ జగన్నాథపురం సుందరగిరి పర్వతంపై లక్ష్మీ నరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 8లో



వరంగా ఫ్యామిలీ డాక్టర్
సంపన్న వర్గాలకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సీఎం జగన్ సామాన్యులకు చేరువ చేశారు. మారుమూల పల్లెల్లోనూ వైద్య సేవలందిస్తున్నారు. 8లో



శ్రీవారి క్షేత్రం కళకళ
ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలోని అనివేటి మండపంలో ఉపనయనాలు, వివాహాలు భారీగా జరిగాయి. దీంతో పెళ్లి జనాలతో క్షేత్రం కళకళలాడింది. 8లో

న్యూస్‌రీల్

నేడు ధ్వజస్తంభాల పునః ప్రతిష్ఠ



గోదావరి జలాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

పెనుమంట్ర : మార్టేరులో ఉమాబ్రహ్మేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివార్ల ఆలయాల ధ్వజస్తంభాల పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆలయ ఆవరణలోని హోమశాలలో విశ్వక్సేన పూజ, వెండి ధ్వజ స్తంభన, ప్రధాన హోమం, మూల మంత్ర హోమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు నరసాపురం కాలువ నుంచి గోదావరి జలాలను బిందెలతో తీసుకువచ్చారు. పంచ జ్యోతులతో గ్రామ ప్రదక్షిణ బలిహరణ, హోమ యాంత్రిక, దర్బార్ సేవల అనంతరం విశేష అలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శివదేవుని చిక్కాలకు చెందిన స్మార్త ఆగమ పరీక్షాధికారి ర్యాలి కృష్ణప్రసాద్, ఆగమ వాసపతి శ్రీనివాసుల సీతారామాచార్యులు, విజయగోపాల ఆచార్యుల ఆధ్వర్యంలో ముఖ్య దాతలు పూజాదికాలు నిర్వహించారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ భయం లేదు

పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు



దెందులూరు : జిల్లాలో బర్డ్‌ఫ్లూ భయం లేదని ఇప్పటివరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు అన్నారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఎక్కడైనా కనిపిస్తే సమర్థవంతంగా సకాలంలో ఎదుర్కోవడానికి ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ప్రతి మండలానికి ఐదు చొప్పున ఇప్పటికే ఏర్పాటుచేశామన్నారు. ఒక్కో బృందంలో పశువైద్యాధికారి, పారామెడికల్ సిబ్బంది, పశువైద్యశాఖ అసిస్టెంట్లు ఉంటారన్నారు. వీరి వద్ద పూర్తిస్థాయిలో మందులు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైద్యసేవలు అందించే బృందాలకు పర్సనల్ కిట్లు కూడా సిద్ధం చేశామన్నారు. వాణిజ్య పౌల్ట్రీ ఫారం యజమానులు అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య సిబ్బందికి తెలియజేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఈ మేరకు జిల్లాలో పౌల్ట్రీ యజమానులకు సూచనలు ఇచ్చామన్నారు. కోళ్లకు ముక్కు నుంచి నీరుకారడం, కన్ను గుడ్లు తెలివేయడం, అకస్మాత్తుగా చనిపోవడం, ఆయాస పడటం, తలవాపు, గుంపులో ఉన్నవి ఒక్కసారే చనిపోవడం వంటివి బర్డ్‌ఫ్లూ లక్షణాలని ఆయన చెప్పారు.

వన దేవతకు వందనం



గుబ్బల మంగమ్మ తల్లి సన్నిధిలో భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే భక్తుల రాక మొదలైంది. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. అలాగే మండలంలోని మర్లగూడెం అటవీ ప్రాంతంలో పాటిమ్మ తల్లి, దుర్గమ్మ తల్లిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఏలూరు జిల్లాలోని 21 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ జనరల్, 5 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు ఆదివారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. 2,175 మందికి 2,126 మంది హాజరయ్యారు. ఉదయం పరీక్షలకు 1,191 మందికి 1,160 మంది, మధ్యాహ్నం 984 మందికి 966 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు.

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి పూజా టికెట్లపై రూ.37,615, ప్రసాదాల విక్రయంపై రూ.16,755, విరాళాల రూపంలో రూ.12,140, ఫొటోల అమ్మకంపై రూ.3,339 మొత్తంగా రూ.69,840 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

వల చిన సంక్షేమం

వేటకు బాసట
- గంగపుత్రులకు అండగా ప్రభుత్వం
- ఐదేళ్లుగా సాఫీగా వేట
- 'మత్స్యకార భరోసా'తో ఊతం
- డీజిల్ సబ్సిడీతో లబ్ధి
- ఆక్వా వర్సిటీ, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు

చేపల వేటే వారి జీవనాధారం.. వేటకు వెళితేనే పూట గడిచేది.. సముద్రపు ఆటుపోట్ల మాదిరి జీవితం తీర ప్రాంతంలోని గంగపుత్రులది. సంక్షేమ పథకాలు అందక, రాయితీలు దరిచేరక నానా ఇబ్బందులు పడేవారు.. ఇదంతా గతం.. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేట సాగించే మత్స్యకారుల సంక్షేమంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఏటా వేట నిషేధ సాయంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచారు. రాయితీలు అందిస్తున్నారు. దీంతో మత్స్యకారులకు బతుకుపై భరోసా పెరిగింది. వేట లాభాల్లోకి వచ్చింది.



నరసాపురం: ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ మత్స్యకార భరోసా పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేల చొప్పున సాయాన్ని అందిస్తున్నారు. అలాగే జిల్లాలో కేవలం 173 మంది ఉన్న లబ్ధిదారుల సంఖ్యను 1,072కు పెంచారు. గత టీడీపీ హయాంలో వేట నిషేధ కాలం ముగిసిన ఐదారు నెలల తర్వాత నామమాత్రంగా సాయం అందించేవారు. జగన్ ప్రభుత్వంలో పక్కాగా వేట నిషేధ కాలంలోనే మత్స్యకారుల ఖాతాలకు సాయం జమచేస్తున్నారు.

గతంలో ముప్పుతిప్పలు
వేట నిషేధ సాయం విషయంలో గత టీడీపీ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టింది. రిలీఫ్ కం సేవింగ్స్ స్కీం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.1,800ను అందించేవారు. లబ్ధిదారులు కూడా 100లోపు మాత్రమే ఉండేవారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఆ ఏడాది ఈ పథకాన్ని ఎగ్గొట్టింది. 2015, 2016లో కుటుంబానికి రూ.2 వేల చొప్పున 98 మందికి మాత్రమే సాయం అందించింది. 2017, 2018లో ఈ సాయాన్ని రూ.4 వేలకు పెంచి కొద్దిమందికే అందించింది.

బాబు ఇచ్చింది రూ.13.04 లక్షలు..
జగన్ ఇచ్చింది రూ.6.40 కోట్లు
వేట నిషేధ సాయం కింద చంద్రబాబు హయాంలో ఐదేళ్లపాటు 375 మందికి రూ.13.04 లక్షలు మాత్రమే అందించారు. సీఎం జగన్ హయాంలో 6,399 మందికి సుమారు రూ.6.40 కోట్లు అందించారు. టీడీపీ హయాంలో వేట బోట్లకు డీజిల్ సబ్సిడీ లీటరుకు రూ.6 ఉండేది. జగన్ సర్కారులో ఈ సబ్సిడీని రూ.9కు పెంచారు. ఒక్కో బోటుకు నెలకు 300 లీటర్ల డీజిల్‌పై సబ్సిడీ అందిస్తున్నారు. దీంతో ఖర్చుల భారం తగ్గి వేట లాభాల బాట పట్టింది. గతేడాది జూన్‌లో వేట ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు సుమారు రూ.300 కోట్ల మత్స్య ఎగుమతులు జరిగినట్టు అంచనా. దీని ద్వారా ఎగుమతులు భారీగా పెరిగినట్టు తెలుస్తోంది.

'ఆక్వా'ంక్షలు ఫలించేలా..
నరసాపురం తీరంలో దశాబ్దాల కలగా ఉన్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.420 కోట్లతో బియ్యపుతిప్ప గ్రామంలో హార్బర్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. అలాగే నరసాపురం ప్రాంతంలో రూ.430 కోట్లతో ఫిషరీస్ యూనివర్సిటీ పనులు, ఈ విద్యా సంవత్సరం నుంచి ఫిషరీస్ కోర్సులు కూడా ప్రారంభమయ్యాయి. ఇలా మత్స్య ఎగుమతులు, శాస్త్రీయ ఆక్వా సాగు పద్ధతులు పెరగడానికి అవకాశం ఏర్పడనుంది.



లాభాల బాటలో వేట

వేట నిషేధ సాయం

వైఎస్సార్‌సీపీ హయాంలో..

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.లలో)
2019	1,072	1,07,20,000
2020	1,092	1,09,20,000
2021	1,200	1,20,00,000
2022	1,400	1,40,00,000
2023	1,635	1,63,50,000
మొత్తం	6,399	6,39,90,000

గత టీడీపీ హయాంలో..

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.లలో)
2014	-	-
2015	52	1,04,000
2016	46	92,000
2017	104	4,16,000
2018	173	6,92,000
మొత్తం	375	13,04,000

రూ.50 వేల లబ్ధి



వేట తప్ప నాకు మరేమీ తెలియదు. వేసవిలో రెండు నెలల పాటు వేట ఉండకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉండేది. గత చంద్రబాబు హయాంలో వేట సాయం కోసం ఎదురు చూసేవాళ్లం. సీఎం జగన్ వచ్చాక ఏడాదికి రూ.10 వేల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల సాయం అందించారు. అలాగే అన్ని పథకాలూ వస్తున్నాయి. ఎన్నడూ లేనంతగా వేట సాఫీగా సాగుతోంది. చాలా ఆనందంగా ఉంది.

–పెమ్మాడి గంటయ్య, వేట కార్మికుడు

వేట పుంజుకుంది



వేట బోట్లకు ఇచ్చే డీజిల్ సబ్సిడీని జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.9కి పెంచారు. బోటును సముద్రంలోకి పంపామంటే రోజుల తరబడి లోపలే ఉంటుంది. ప్రధానంగా డీజిల్ ఖర్చు ఎక్కువ. సబ్సిడీ రావడంతో ఇబ్బంది లేదు. ఒక్కో బోటుపై 10 మంది పనిచేస్తారు. వారికి పడ్డ సరుకులో కమీషన్ ఉంటుంది. వేట పుంజుకుంది. ప్రస్తుతం లాభాలు చూస్తున్నాం.

–పీతల ప్రసాద్, వేట బోటు యజమాని

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

ఏలూరు టౌన్: సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్నివిధాలా అండగా నిలిచేందుకు ఆయన చేస్తున్న కృషికి అందరూ తోడుగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 2వ డివిజన్‌కు చెందిన పాతినవలస రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో సుమారు 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో రాజేష్ కార్పొరేటర్‌గా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. సీఎం జగన్ సుపరిపాలన, ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంపై ఆకర్షితులై రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచేందుకు పార్టీలో చేరారు. ఆయనతోపాటు ఆ ప్రాంతానికి చెందిన మహిళలు, యువత పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామనీ, పేదవర్గాల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలకు సీఎం జగన్ పాలనపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ప్రతిపక్ష టీడీపీ, జనసేనలకు ప్రజలే బుద్ధి చెబుతారనీ, ఎన్నికల హామీలను సైతం అమలు చేయకుండా మోసం చేసే చంద్రబాబు మాటలను, మేనిఫెస్టోను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

జగన్ పాలనలోనే గ్రామ స్వరాజ్యం

మండలి చైర్మన్ మోషేన్‌రాజు

పాలకోడేరు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాకారమైందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆదివారం శృంగవృక్షంలోని పాలపర్తిపేటలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ జంగం సూరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ దళితవాడల్లో ప్రభుత్వ కార్యాలయం పెట్టడం జగనన్న పాలనలోనే సాధ్యమైందన్నారు గతంలో ప్రజలు తమ పనుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు నివాసం ఉన్నచోటే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడం, సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్ సెంటర్లు కూడా ముంగిట్లోనే నెలకొల్పడం శుభపరిణామమన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అన్ని పథకాలు ప్రజల ఇంటికే వస్తున్నాయన్నారు. నవరత్నాలు పథకాల పేరుతో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతుందని, వారి చిరునవ్వులే సీఎం జగన్‌కు ఆశీస్సులు అన్నారు. ప్రభుత్వాన్ని, వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు.

సామాజిక న్యాయం చేసిన ఘనత
డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ అన్నివర్గాలకు సామాజిక న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎస్సీలు, బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పథకాలను మహిళలకు వర్తించేలా రూపకల్పన చేసి రాష్ట్రంలో స్త్రీ సాధికారతకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, సర్పంచుల సంఘం మండల కార్యదర్శి బొల్లా శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు సోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీతులసి, ఎంపీటీసీలు మల్లుల సూర్యకళ, బొల్లం గాంధీ, ఉప సర్పంచ్ కలిదిండి ఆనందరాజు, గెడ్డం జోషి, వీరవల్లి లక్ష్మణరావు, పేరిచర్ల కనకరాజు, చాబత్తుల రవి, దుండి రవి, చెల్లబోయిన పాపారావు, ఎంపీడీఓ టి.అనూహ్య, తహసీల్దార్ కె.నాగార్జున, అధికారులు, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



శృంగవృక్షంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు. చిత్రంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

అంగన్‌వాడీలకు సొంత భవనాలు

నిర్మాణం.. శరవేగం
- 57 కేంద్రాలకు భవనాల మంజూరు
- 32 నిర్మాణాలు 90 శాతం పూర్తి
- ఒక్కో భవనానికి రూ.16 లక్షల కేటాయింపు
- మొత్తంగా రూ.9.12 కోట్ల నిధులు

భీమవరం (ప్రకాశం చౌక్) : విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం జగన్ నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. నాడు–నేడులో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను సమకూరుస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాకు 57 భవనాలను మంజూరు చేయగా 32 చోట్ల నిర్మాణాలు 90 శాతం మేరకు పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తయిన భవనాల్లో చిన్నపాటి పనులు ఉండగా వాటిని వేగంగా పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మిగిలిన భవనాలు రూఫ్‌స్థాయిలో ఉన్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాలు

సొంత భవనాలు ఉన్నవి	548
అద్దె భవనాల్లో ఉన్నవి	626
ఫ్రీ రెంట్‌లో ఉన్నవి	388
మొత్తం	1,562



పాలకొల్లు మండలం మామిడిగుంటలో నిర్మాణం పూర్తయిన భవనం



యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలో తుది దశకు చేరిన భవన నిర్మాణం

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణం

మండలం	నిర్మాణాలు	మండలం	నిర్మాణాలు	మండలం	నిర్మాణాలు
ఆచంట	7	వీరవాసరం	2	తాడేపల్లిగూడెం	2
పెనుగొండ	1	మొగల్తూరు	10	అత్తిలి	4
పెనుమంట్ర	2	నరసాపురం	2	ఆకివీడు	1
పోడూరు	9	పాలకొల్లు	4	కాళ్ల	1
భీమవరం	2	యలమంచిలి	4	పాలకోడేరు	2
		పెంటపాడు	3	ఉండి	1

రూ.9.12 కోట్ల ఖర్చు
జిల్లాలో 57 భవనాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.16 లక్షల చొప్పున మొత్తం రూ.9.12 కోట్లను ఖర్చు చేస్తున్నారు. భవన నిర్మాణంతో పాటు ఫర్నిచర్ ఏర్పాటుచేస్తారు. కిచెన్, హాల్, క్లాస్ రూమ్, టాయిలెట్ తదితర సౌకర్యాలతో కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

దశల వారీగా..
జిల్లాలో మొత్తం 1,562 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 626 సెంటర్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దశల వారీగా వీటన్నింటికీ సొంత భవనాలు సమకూర్చనున్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణం ఊసే ఎత్తలేదు.

చురుగ్గా నిర్మాణాలు



జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే 23 భవనాల నిర్మాణం పూర్తికాగా, 32 భవనాలు రూఫ్ దశలో, మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయి. పూర్తయిన భవనాల్లోకి వేగంగా అంగన్‌వాడీ కేంద్రాలను మార్చడానికి చర్యలు తీసుకుంటున్నాం. నూతన భవనాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

– సుజాతారాణి, పీడీ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ

చాలా సంతోషం



మా గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం చాలా కాలంగా అద్దె భవనాల్లో కొనసాగుతుంది. ప్రభుత్వం మా అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం మంజూరు చేయగా దాదాపు నిర్మాణం పూర్తి కావచ్చింది. అన్ని సౌకర్యాలు ఉండేలా సొంత భవనం నిర్మించడం చాలా సంతోషంగా ఉంది.

– ఎ.మాధవి, అంగన్‌వాడీ కార్యకర్త, అబ్బిరాజుపాలెం

చంద్రబాబును తరిమికొట్టేందుకు సిద్ధం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి



తాడేపల్లిగూడెం (టీటీసీ): చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికలలో ఆయన్ని ప్రజలు తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కులవాదులు నిర్మించిన 'రాజధాని ఫైల్స్' సినిమాలో అన్నీ అవాస్తవాలే చిత్రీకరించి చూపించారని విమర్శించారు. హింసను ప్రేరేపించేలా సినిమా ఉందని, డైరెక్టర్లను అరెస్టు చేసి వివాదాస్పద సీన్‌లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంగరాజు డిమాండ్ చేశారు. ఉద్దండరాయునిపాలెంలో మూడు రాజధానులకు మద్దతుగా దీక్షలు చేస్తుంటే ఆ చిత్ర నిర్మాతకు కనబడటం లేదా అని ప్రశ్నించారు. అమరావతి రాజధాని వల్ల తన కులానికి మేలు చేయాలనే తపన తప్ప, అన్నివర్గాలకు సమన్యాయం జరగాలనే ఆలోచన చంద్రబాబుకు లేదని విమర్శించారు. వేలాది ఎకరాలు లాక్కోవడం వల్ల అక్కడ వేలాది మంది రైతు కూలీలు ఉపాధి కోల్పోయారని, ఆ వివరాలు చూపించకపోవడం సరికాదన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధినే ప్రజలు కాంక్షిస్తున్నారని, మూడు రాజధానులపై ప్రజలు స్వాగతిస్తున్నారని వెల్లడించారు. శ్రీనివాస్, బాబురావు, సునీల్ బాబు ఆయనతో ఉన్నారు.

క్లుప్తంగా

భారీగా తెలంగాణ మద్యం పట్టివేత



నిందితుడు, మద్యం బాటిళ్లతో అడిషనల్ ఎస్పీ రవికుమార్

పాలకొల్లు సెంట్రల్: కాపవరంలో భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ ఆదివారం చెప్పారు. కాపవరం గ్రామంలో భారీగా మద్యం బాటిళ్లు ఉన్నట్లు తమకు అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా రోడ్డుకు ఎడమవైపున ఉన్న చెరువు వద్ద ఓ ఇంట్లో 110 మద్యం బాటిళ్లు, 72 బీరు సీసాలు దొరికినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందన్నారు. అంగర అప్పలనర్సయ్య, అంగర సుబ్బారావులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రవికుమార్ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఈబీ ఇంటెలిజెన్స్ ఎస్సై అడబాల సతీష్, పట్టణ ఎస్ఈబీ సీఐ జే భవానీ, ఎస్సై రామ్‌ప్రసాద్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రేమిస్తున్నానని నమ్మించి తన వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు దోచుకున్నాడని ఒక యువతి ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ యువతికి స్థానిక జువ్వలపాలెం శివాలయం వీధిలో నివాసం ఉంటున్న బట్టు రమేష్‌తో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. బట్టు రమేష్ యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించి ఆమె వద్ద నుంచి బంగారు నగలు, కొంత నగదు తీసుకున్నాడు. తరువాత ముఖం చాటేశాడు. రమేష్‌తో మాట్లాడేందుకు యువతి ప్రయత్నించగా తప్పుకు తిరుగుతున్నాడు. దీంతో యువతి తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. హౌసింగ్ బోర్డు ప్రాంతంలో యనమండ్ర సజ్యోతి (68) కొంతకాలంగా నివాసం ఉంటోంది. రెండు రోజుల నుంచి సజ్యోతి ఇంటి తలుపులు తెరవకపోవడాన్ని స్థానికులు గమనించి ఆమెను పిలిచేందుకు ప్రయత్నించారు. ఇంటి వద్దకు వెళ్లేసరికి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్సై సుధాకర రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సజ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ శకం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



నేను కుక్కలవారితోటలో చిన్నపాటి కిరాణా దుకాణం నిర్వహించుకుంటున్నా. తల్లితండ్రులు వయోభారం కారణంగా ఇంటి వద్దే ఉంటున్నారు. నాకు భార్య కరుణ, ఇద్దరు కుమార్తెలు మేఘన, గీతాప్రియ ఉన్నారు. దుకాణంపై వచ్చే ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. విద్యాదీవెన, వసతి దీవెనతో పెద్ద కుమార్తె మేఘనను బీటెక్ చదివించగా, చిన్న కుమార్తె గీతాప్రియ బీఎస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. మేఘన పేరున కిరాణా దుకాణం ఇంటి వద్దనే పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నా. ముందెన్నడూ ఏ ప్రభుత్వంలోనూ సంక్షేమ పథకాలు లేవు. సీఎం వైఎస్‌జగన్ మా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నారు. సీఎంకు కృతజ్ఞతలు. – **వనం రాజేష్, కుక్కలవారితోట, మొగల్తూరు**



కుటుంబంలో అందరికీ లబ్ధి



నా భర్త శ్రీను ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉన్నారు. మాకు ఇద్దరు పిల్లలు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా లబ్ధి పొంది ఇంజినీరింగ్ చదివారు. నా తల్లి విజయలక్ష్మికి ఆసరా పథకంలో, చెల్లెలు కనకరత్నం పిల్లలకు అమ్మ ఒడి పథకం, తాతయ్యకు పింఛన్ వస్తోంది. గతంలో పింఛన్ కోసం తాతయ్యను తీసుకుని పంచాయతీ ఆఫీసుకు వెళితే గంటల తరబడి ఎదురుచూసే దాన్ని. చిరిగిన నోట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం పింఛన్ సొమ్ము వలంటీర్ ద్వారా ఇంటికే వచ్చి ఇస్తున్నారు. ఎంతో సంతోషంగా ఉంది.

– **కొల్లాబత్తుల కుమారి, 16వ వార్డు, పాలకొల్లు**

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



మాది మణి ఎస్‌హెచ్‌జీ గ్రూప్. వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ద్వారా మా సంఘానికి రూ.7 లక్షల వరకు రుణమాఫీ జరిగింది. అలాగే ఎస్‌హెచ్‌జీ ద్వారా మేము తీసుకున్న రుణానికి సున్నా వడ్డీ పథకం కూడా వర్తిస్తోంది. ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్ ఏవిధంగా మహిళలకు మేలు చేస్తానని హామీ ఇచ్చారో అదేవిధంగా తన పాలన కొనసాగిస్తూ మహిళలను ఆదుకున్నారు. నాకు సొంతిల్లు ఏర్పడింది. నా కుమారుడికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సైతం అందింది. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నా.

– **మట్టా సునీత, జంగారెడ్డిగూడెం**

నమో నారసింహా

- రేపటి నుంచి సుందరగిరిపై నారసింహుని కల్యాణోత్సవాలు
- 22న స్వామివారి కల్యాణం.. వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుమనోహర సుందరగిరి పర్వతంపై శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భీష్మ ఏకాదశి పర్వదినం నుంచి ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. కల్యాణోత్సవాలకు శ్రీవారి దేవస్థానం అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షామియానా, చలువ పందిళ్లు, ప్రత్యేక దర్శనం క్యూలైన్లను నిర్మించారు. అలాగే విద్యుద్దీప అలంకారాల పనులు పూర్తయ్యాయి. పురాణ ప్రాశస్త్యం గల ఈ ఆలయాన్ని దర్శిస్తే కోరిన కోర్కెలు తీరి, సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. ఏకాదశి వంటి పర్వదినాల్లో వేలాదిగా భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. చినవెంకన్న దేవస్థానం ప్రతి ఏటా స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది. ఈ ఏడు ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ రాత్రి 7 గంటల నుంచి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ నెల 20న ఉదయం 10.40 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తారు. రాత్రి కూచిపూడి భరత నాట్యప్రదర్శన, 21న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు నిత్యపూజలు, హోమాలు, మూలమంత్ర హవనములు, బలిహరణ, వేద పారాయణ, నిత్య హోమాలు, మండప పూజలు, రాత్రి భక్తి రంజని, 22న ఉదయం 11.10 గంటల నుంచి స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, రాత్రి రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన, 23న సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం, రాత్రి శ్రీరత్నాలు పౌరాణిక నాటకం, 24న ఉదయం 8 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణ, రాత్రి మ్యూజికల్ పాటలు, 25న రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం, రాత్రి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన నిర్వహిస్తారు.



గర్భాలయంలో కొలువైన శ్రీలక్ష్మీనారసింహుడు



సుందరగిరిపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన షామియానా పందిళ్లు

క్షేత్ర విశిష్టత ఇదీ..

మతంగి మహర్షి తపస్సు ఫలితంగా సుందరగిరి పర్వతంపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారు స్వయంభూః, శాలిగ్రామ రూపంలో వెలిశారు. ఇప్పటికీ మతంగి మహర్షి సర్ప రూపంలో స్వామి వారిని నిత్యం సేవిస్తారని ప్రసిద్ధి. ఆలయం వెనుక ఎన్నో ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న పుట్టే ఇందుకు సాక్ష్యమని ఆలయ అర్చకులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉగ్రరూపంలో ఉన్న స్వామివారిని శాంతింపజేసేందుకు 1995లో తమిళనాడుకు చెందిన శ్రీధర్ గురూజీ, హైదరాబాద్‌కు చెందిన ఆయన ప్రధాన శిష్యులు కొచ్చెర్లకోట నరసింహ గురూజీలు ఆలయ ఆవరణలో కనకవల్లీ దేవి అమ్మవారి విగ్రహాన్ని, అలాగే అష్టదిక్కులలో మండపాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఏ ఆలయంలోను లేనటువంటి ఏకాక్షరి గణపతి, కాలభైరవుడు, సర్ప వెంకటేశ్వరుడు, చింతామణి గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, దత్తాత్రేయుడు, నవగ్రహాలు, అలాగే ఆలయ క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామివారు ఇక్కడ భక్తులకు దర్శనమిస్తున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినం నాడు నరసింహ గురూజీ ఆధ్వర్యంలో మహా సుదర్శన యాగాన్ని ఘనంగా జరుపుతున్నారు. అందులో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొంటున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం



నారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్లో పాల్గొనే వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. కొండ కింద కల్యాణ మండపంలో ఈనెల 22న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి.

– **వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ**

బిషప్ జయరావుకు ఎమ్మెల్యే ఆళ్ల నాని శుభాకాంక్షలు



ఏలూరులో బిషప్ జయరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు కథోలిక పీఠాధిపతులు, సోషల్ సర్వీస్ సెంటర్ చైర్మన్ బిషప్ డాక్టర్ జయరావు పొలిమేరను ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖపట్నం అగ్రపీఠం అపోస్తలిక పాలనాధికారిగా బిషప్ పొలిమేర జయరావు నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా ఏలూరులోని ఆర్‌సీఎం బిషప్ హౌస్‌లో ఆదివారం జయరావును ఎమ్మెల్యే ప్రత్యేకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తమతో బిషప్ జయరావుకు ప్రత్యేకంగా ఉన్న ప్రేమాభిమానాలను దృష్టిలో పెట్టుకుని ఆయన మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని, ప్రజలకు దేవునికి మధ్య వారధిగా ఉంటూ ప్రజల క్షేమం, శాంతి, అభివృద్ధికి ప్రార్థించాలని కోరారు. దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయని బిషప్ జయరావు ఎమ్మెల్యేను ఆశీర్వదించి, ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏలూరు కో–ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు, కార్పొరేటర్ పొలిమేర రామదాసు, ఫాదర్లు ఉన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: మంచిలి అయ్యప్ప నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ అయ్యప్పస్వామి, శ్రీ ఆంజనేయ స్వామివార్ల విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. పురోహితులు పురాణపండ వెంకట సూర్య సుబ్బారావు, కందుకూరి గణేష్ కుమార్ శర్మ ఆధ్వర్యాన గణపతి పూజ, యంత్ర విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన శిరగాని కృష్ణమూర్తి, శిరగాని నాగేశ్వరరావు, కవురు సీతారామారావు, పెండెం రాంబాబు దంపతులచే విగ్రహ ప్రతిష్టాపన పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.



అనివేటి మండపంలో జరుగుతున్న వివాహాలు



పెళ్లి జనాలతో రద్దీగా అనివేటి మండపం



శ్రీవారి దర్శనం కోసం ఆలయంలోకి వెళుతున్న కొత్త జంట

పెళ్లిళ్లతో శ్రీవారి క్షేత్రం కళకళ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదివారం ఉదయం ఉపనయనాలు, వివాహాలు భారీగా జరిగాయి. మాఘమాసంలో మంచి ముహూర్తాలు కావడంతో ఆలయ అనివేటి మండపంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను జరుపుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు పెళ్లి జనాలతో కిటకిటలాడాయి. క్షేత్రంలో అలాగే, వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న కొత్త జంటలు స్వామి, అమ్మవార్లను దర్శించారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆదివారం రాత్రి సైతం క్షేత్రంలో వివాహాలు పెద్ద ఎత్తున జరిగాయి. కొండ పైన, కొండ దిగువనున్న అన్ని దేవస్థానం, ప్రైవేట్ కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లలో పెళ్లిళ్లు జరిగాయి.

గడపగడపకు సంక్షేమం



ఉండి: యండగండిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



వేగవరంలో భద్రరావుకి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: పక్షవాతంతో మంచానికే పరిమితమైన తమ మిత్రునికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటారు పూర్వ విద్యార్థులు. జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–90లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు తమ మిత్రుడు వేగవరానికి చెందిన దివ్యాంగుడు కాగితాల భద్రరావు రెండేళ్ల నుంచి పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడని తెలుసుకుని రూ.1,82,700 ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు, జంగారెడ్డగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమృత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

కుక్కునూరు: అల్లిగూడెం సమీపంలో ఆదివారం జరిగిన రోడడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బొనగిరి గ్రామానికి చెందిన తుర్సం శివ, అల్లిగూడెం గ్రామానికి చెందిన రాంప్రసాద్ ద్విచక్రవాహనంపై అల్లిగూడెం వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తుర్సం శివకు తీవ్రగాయాలు కాగా, రాంప్రసాద్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ శివను స్థానికులు చికిత్స నిమిత్తం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

గిరిపల్లెలకు వరంగా ‘ఫ్యామిలీ డాక్టర్’

- మారుమూల గ్రామాల్లో ఇళ్ల వద్దకే వైద్యం
- అందుబాటులో 67 రకాల మందులు
- క్షేత్ర స్థాయిలో 14 రకాల వైద్య పరీక్షలు
- నియోజకవర్గంలో 80 హెల్త్ క్లినిక్‌లు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిపుత్రులు



అటవీప్రాంతంలో కాలినడకన వెళుతున్న వైద్యులు, సిబ్బంది

బుట్టాయగూడెం: ఒకప్పుడు సంపన్న వర్గాలకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇప్పుడు సామాన్యులకు చేరువైంది. ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవల్లో నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వైద్యులే ఇంటికి వచ్చి సేవలందించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ గిరిజన ప్రాంత ఆదివాసీ గిరిజనులకు వరంగా మారింది. గతంలో మారుమూల కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న కొండరెడ్డి గిరిజనులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే కొండలు, గుట్టలు దాటుకుంటూ మైళ్ల దూరం కాలినడకన అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునేవారు. ఇప్పుడు ఈ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వైద్యులే కాలినడకన నడుచుకుంటూ కొండలు, గుట్టలు దాటుకుంటూ గ్రామాల్లో గిరిజనుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంటి వద్దకే వెళ్లి డాక్టర్లు వైద్య సేవలు అందించాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంపై కొండరెడ్డి గిరిజనులు అభినందించి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇంటి వద్దకే డాక్టర్, సిబ్బంది

అనారోగ్యంతో బాధపడుతూ నడవలేక మంచానికే పరిమితమైన వారు, పక్షవాతంతో ఉన్న వారు, ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతిలో ఉన్నవారు, నిండు గర్భిణులు, చిన్న పిల్లల వద్దకు డాక్టర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు ఉచితంగా ఇస్తున్నారు. అలాగే ఎవరికైనా అత్యవసర వైద్య సేవలు అవసరమైతే అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో సుమారు 500 మంది గర్భిణులు, 408 మంది బాలింతలు, 1200 మంది జ్వరపీడితులు, సుమారు 2వేల చిన్నారులు, అలాగే 3,800 మందికిపైగా హిమోగ్లోబిన్ టెస్టులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



మారుమూల అటవీప్రాంతం రేగులపాడులో పసిపాపకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నందిని



రేపల్లెలో చిన్నపిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రామస్థాయిలోనే వైద్య సేవలు



గ్రామ స్థాయిలోనే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించే విధంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చింది. ఇది మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో వరమనే చెప్పాలి. వైద్యులు, సిబ్బంది పల్లెలకు వెళ్లి ప్రాథమికంగా అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలు ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– **మేరీ కేథరిన్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం**

రోగులకు ఎంతో ఉపయోగకరం



ఆస్పత్రులకు వెళ్లకుండా గ్రామాల్లోకే అన్ని రకాల రోగాలకు వైద్యులు ఇంటి వద్దకే వచ్చి సేవలు అందించడం దేశ చరిత్రలోనే ఎక్కడాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టి పటిష్టంగా అమలయ్యేలా కృషి చేస్తున్నారు. వైద్యులు, సిబ్బందే కాలినడకన గిరిజన గ్రామాలకు వెళ్ళి వైద్యసేవలు అందించడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– **తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం**

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ తణుకు మండలాధ్యక్షునిగా వీర్రాజు



బోడపాటి వీర్రాజు

తణుకు టౌన్: వైఎస్సార్ సీపీ తణుకు మండల కమిటీ నియామకమైంది. మొత్తం 27 మంది కార్యవర్గంతో జాబితాను ప్రకటించారు. అధ్యక్షునిగా బోడపాటి వీర్రాజు, ఉపాధ్యక్షులుగా నిమ్మకాయల సురేష్‌బాబు, సరెళ్ల వీరతాత, ప్రధాన కార్యదర్శులుగా కె.మధు మురళి, జీఎల్‌వీఎన్ సత్య స్వామిజీ, కార్యదర్శులుగా కత్తుల జస్పాల్, సైదు త్రిమూర్తులు, కాపకాయల వరప్రసాద్, చుక్కా సత్యనారాయణ, సఖినాల శ్రీను, కోశాధికారిగా లగడపాటి సుబ్రహ్మణ్యంతో పాటు మరో 14 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

వైభవంగా అరుణ, ధన్వంతరి హోమాలు



అరుణ, ధన్వంతరి హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాఘమాసం సందర్భంగా పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆదివారం నిత్య పూజలు అనంతరం మళ్లీ సూర్యనారాయణ బ్రహ్మత్వంలో శ్రీ అరుణ, శ్రీ ధన్వంతరి హోమాలు ఘనంగా జరిగాయి. గణపతి పూజ, నవగ్రహ మండపారాధనలు, అష్టోత్తర పూజలు జరిగాయి. భక్తులు హాజరైయారు. హోమ ఏర్పాట్లను ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.


గట్టిం మాణిక్యాలరావుకు వినతి పత్రం



మాణిక్యాలరావుకు వినతిపత్రం ఇస్తున్న కడియద్ద గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామానికి చెందిన ఎం.లక్ష్మి గల్ఫ్ దేశాలైన కత్తర్‌లో ఇబ్బందులు పడుతుందని ఆమెను తిరిగి ఇండియాకు తీసుకొచ్చేందుకు సహకరించాలని ఆదివారం ఆమె కుటుంబ సభ్యులు గల్ఫ్‌హెల్ప్ నిర్వాహకులు, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందించారు. లక్ష్మి అక్కడ అనారోగ్యంపాలైందని, కత్తర్‌లోని యజమానులు తీవ్రమైన మానసిక వేదనలకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ మస్కట్‌లో ఇబ్బందులు పడుతున్న లక్ష్మిను ఇండియాకు రప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై కళాజాత



హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణాయపాలెం, నందమూరు గ్రామాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటిక, ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. మిరియాల రవిబాబు కళాజాత బృందం పర్యవేక్షణలో ఈ నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్ల ప్రాధాన్యతను వివరించారు. ఎయిడ్స్ నియంత్రణ మండలి సిబ్బంది, ఆయా గ్రామాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవం



మావుళ్లమ్మకు పూజలు చేస్తున్న గూడూరి ఉమాబాల

భీమవరం: అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల ఆకాంక్షించారు. భీమవరంలోని బొక్కావారి పాలెం లో జరిగిన శ్రీ మావుళ్లమ్మ జాతర మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు వేండ్ర వెంకటస్వామి, బొక్కా చంద్రమోహన్, బొక్కా హనుమంతు, గాదిరాజు రాము, కట్టా రవి, బొక్కా నాని, కాముజు చిన్నా, బొక్కా గిరి, నందమూరి సుధాకర్, గూడూరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వాకింగ్

- ఆసక్తి చూపుతున్న ప్రజలు
- వ్యాయామానికి పట్టణ వాసుల ప్రాధాన్యం



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు అంటుంటారు. ఆ మాట అక్షర సత్యమని నమ్మిన ఆరోగ్య అభిలాషులు క్రమ తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. మరికొందరు యోగా, జిమ్‌లకు వెళ్తున్నారు. అందుకే వీరితో పట్టణంలోని క్రీడా మైదానాలు, జిమ్‌లు ఉదయం, సాయంత్రం వేళల్లో కిటకిటలాడుతున్నాయి. మైదానం ప్రాంతాలతో పాటు వివిధ క్రీడా మైదానాలు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లపై వాకింగ్, జాగింగ్‌లు చేసేందుకు జనం తరలి వస్తున్నారు. వృద్ధులతో పాటు యువతీ యువకులు సైతం ఆయా మైదానాల్లో వ్యాయామం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు వాకింగ్ వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు. రోజుకు 50 నుంచి 70 మంది వరకూ వచ్చే వాకర్స్ ఇప్పుడు 130 నుంచి 150 వరకూ పెరిగారని అంటున్నారు. రోజు ఒక గంట వ్యాయామంతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బరువు తగ్గించుకునేందుకు..

ప్రస్తుత జీవన విధానంలో మారిన ఆహార అలవాట్ల కారణంగా జనాభాల్లో అధిక శాతం మంది స్థూలకాయ సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువతీ యువకులు అధిక బరువు కారణంగా పలు రోగాల బారిన పడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గార్‌లు వంటి జంక్ ఫుడ్‌లను అధికంగా తినడంతో ఈ సమస్య వస్తోంది. ముఖ్యంగా అధిక బరువుతో బాధపడుతున్న వారు వాకింగ్ ట్రాక్‌లలో పరుగులు తీస్తున్నారు. మరికొందరు గంటల తరబడి వ్యాయామశాలల్లో వ్యాయామాలు చేస్తున్నారు. ఇంకొందరు యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలివి

ప్రతిరోజు నడకతో బీపీ, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. గుండె జబ్బులు, కొలస్ట్రాల్, కీళ్ల, మోకాళ్ల నొప్పులు అందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చు. శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం వల్ల వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత పెరుగుతోంది. మంచి ఆలోచన శక్తి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి అంశాలలో ప్రజల్లో అవగాహన స్థాయి పెరిగింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ ఎక్కువైంది. శరీర శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం వివిధ రకాల ఆటల పోటీలను, అవగాహనా సదస్సులను నిర్వహిస్తోంది.

షుగర్ నియంత్రణలో ఉంది



గత 20 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నాను. రోజూ సాయంత్రం పూట 40 నిముషాల పాటు నడుస్తుంటాను. షుగర్ నియంత్రణలోనే ఉంది. బలహీనత అంటూ తెలియడంలేదు. ఆరోగ్యంగానే ఉంటున్నా. – ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, రిటైర్డ్ టీచర్, తణుకు

30 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నా



గత 30 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నా. ఉదయం, సాయంత్రం గంట పాటు వాకింగ్ చేస్తున్నా. బలహీనతలు లేకుండా చేస్తుంది. నిద్ర బాగా పడుతుంది. – పి.సూర్యనారాయణ, రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి

వాకింగ్ తప్పనిసరి



గుండెకు స్టంట్ వేసిన తర్వాత వాకింగ్ తప్పని సరైంది. గత 20 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నా. వాకింగ్ వలన శరీరంలో ఉండే నరాలన్నీ కదలడం వలన రక్త ప్రసరణ బాగుంటుంది. – అజ్జరపు విశ్వన్న పంతులు, రిటైర్డ్ హెచ్‌ఎం, తణుకు

నడకతో దృఢత్వం పెరిగింది

రోజుకు గంటన్నర నడకతో శరీరంలో దృఢత్వం పెరిగింది. పది అడుగుల నడక రోగాలను దూరం చేస్తుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా శరీరంలో షుగర్, బీపీ స్థాయిలు పెరగకుండా ఉంచుతుంది. – ఉల్లంపర్తి సూర్యారావు, రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, తణుకు

వాకర్స్ జిల్లా సభ్యులకు అభినందనలు



జిల్లా క్యాబినెట్‌లో చేరిన తాడేపల్లిగూడెం వాకర్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఏలూరులో నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నుంచి వాకర్స్ ఇంటర్నేషనల్ అడ్వైజర్‌గా కేవీ కృష్ణారావు, డిప్యూటీ గవర్నర్‌గా ప్రవా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా వీఎస్ ప్రసాద్, జోన్ ఛైర్మన్‌లుగా బాకా వెంకటేశ్వరరావు, కేవీ చలం, కోపల్లె శ్రీనివాస్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కార్యవర్గంలో చేరిన వాకర్స్‌ను పట్టణంలోని వాకర్స్ అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కుంచనపల్లి సబ్‌స్టేషన్ పరిధి కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురంతో పాటు మోదుగ గుంట సబ్‌స్టేషన్ పరిధి మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, టిడ్కో సబ్ స్టేషన్‌కు సంబంధించి ఎల్.అగ్రహారం, టిడ్కో గృహాలు, కొండ్రుప్రోలు, కేఎస్ఎన్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు తాడేపల్లిగూడెంలో ‘వలంటీర్లకు వందనం

తాడేపల్లిగూడెం: సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకు తీసుకెళ్లి విశేష సేవలందిస్తున్న వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం బలుసులమ్మ కల్యాణ మండంలో డిప్యూటీసీఎం కొట్టు సత్యనారాయణ పర్యవేక్షణలో జరుగనుంది. తాడేపల్లిగూడెం మండలంలో 522 మంది వలంటీర్లు ఉండగా, వీరిలో ఇద్దరికి సేవావజ్ర, ఐదుగురికి సేవా రత్న, 488 మందికి సేవామిత్ర అవార్డులను అందజేయనున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 561 మంది వలంటీర్లు ఉండగా, వీరిలో ఇద్దరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 529 మందికి సేవా మిత్ర అవార్డులను ఇవ్వనున్నారు. పెంటపాడు మండలంలో 440 మంది వలంటీర్లు ఉండగా, ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవారత్న, 424 మందికి సేవా మిత్ర అవార్డులు కలిపి ఐదుగురికి సేవా వజ్ర, 15మందికి సేవారత్న, 1441 మందికి సేవామిత్ర అవార్డులను అందజేస్తారు.

సేవా వజ్రలు వీరే

తాడేపల్లిగూడెం మండలానికి సంబంధించి ఎల్.అగ్రహారానికి చెందిన పి.రత్తాలు , పెదతాడేపల్లికి చెందిన దూలపల్లి గాయత్రి, తాడేపల్లిగూడెం పట్టణానికి సంబంధించి గుణ్ణంవారి వీధికి చెందిన రుత్తల అనూష, బోదెగట్టుకు చెందిన నీరుకొండ లీలావతి, పెంటపాడు మండలంలో పెంటపాడుకు చెందిన ఉండ్రాజవరపు స్పందనలకు ఇవ్వనున్నారు.

సేవారత్నలు వీరే

జగన్నాథపురంలో లంకా కోటేశ్వరరావు, ఎల్.అగ్రహారం సత్తిరెడ్డి లక్ష్మీదుర్గా, పడాలలో భవిరిశెట్టి భరత్‌కుమార్, పట్టింపాలెంలో గంటి స్వాతి, పెదతాడేపల్లిలో పసుమర్తి నాగఫణీంద్ర లకు మండలంలో సేవారత్న అవార్డులు ఇవ్వనున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో వీకర్స్‌కాలనీలో షేక్ షహీనా, నవ్వారుపేటలో పాడి శ్రీను, యాగర్లపల్లిలో యేడిద భద్రి, కొండాయచెర్వులో మానేపల్లి రాజు, కడకట్లలో కనపర్తి లీలాప్రసన్నలకు సేవారత్న అవార్డులు ఇవ్వనున్నారు.

పెంటపాడు మండలంలో బి.కొండేపాడులో పిల్లి పద్మ, మీనవల్లూరులో చల్లా జ్యోతి, రావిపాడులో తూము సాయి, వల్లూరుపల్లి లో మీసాల శ్రీను, పెంటపాడులో సత్తి వెంకటలక్ష్మి లకు సేవారత్నలు ఇస్తారు. నియోజకవర్గంలో సేవామిత్రలుగా 1,441 మందికి అవార్డులు ఇవ్వనున్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు

తణుకు టౌన్: వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు పి.సురేష్ కోరారు. ఎస్సీ సెల్ ఆధ్వర్యాన ఆదివారం రాత్రి తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో నిర్వహించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం, మన కారుమూరిని గెలిపిద్దాం అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు జంగం ఆనంద్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ చరిత్రలో ఏ నాయకుడు అమలు చేయని విధంగా అన్ని పదవుల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించారని, తణుకు ఏఎంసీ పదవిని ఎస్సీలకు కేటాయించారని చెప్పారు. అలాగే రాజ్యసభ ఎంపీ పదవులతో పాటు మంత్రి పదవులు కూడా కేటాయించారన్నారు.

ప్రజా సేవకులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు సేవలందిస్తున్నారని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం భీమవరం మండలంలోని వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టినప్పుడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వలంటీర్లను అవమానకరంగా మాట్లాడారని గుర్తుచేశారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వలంటీర్లకు సమాజంలో అత్యంత గౌరవాన్ని కల్పించి ప్రజల్లో వారికంటూ గుర్తింపునిచ్చారని అన్నారు. భీమవరం మండలంలో సేవా వజ్ర అవార్డులు ఇద్దరికి వచ్చాయని, వారికి రూ.45 వేలు చొప్పున, సేవ రత్న అవార్డులు ఐదుగురికి వచ్చాయని, వారికి రూ.30 వేలు చొప్పున, అలాగే 363 మంది వలంటీర్లకు రూ.15 వేల చొప్పున నగదు పురస్కారాలను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, సర్పంచులు కోళ్ల బాలకృష్ణ, చిల్లే వెంకటేష్, జల్లా కొండయ్య, ఆరేటి వీరస్వామి నాయుడు, ఒడుగు ముత్యాలరావు, కేతా నాగబాబు, రామాని శివాజీ వర్మ, అల్లూరి శ్రీహరి రాజు, ఎంపీటీసీలు తిరుమాని తులసీరావు, రామాని నరసింహారావు, కొప్పర్తి సత్యనారాయణ, కోమటి రాంబాబు, నామన మహేష్, మద్దాల రమణ, కొట్టి కుటుంబరావు, గొట్టుముక్కల పద్మరాజు, శ్రీరాంపురం ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉండి: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల కోసం మండలంలోని అధికార యంత్రాంగం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఎంపీడీవో ఎస్.రవీంద్ర మండలంలోని మహదేవపట్నం గ్రామంలో 61 నుంచి 65 పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఉండాల్సిన మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలతో పాటు దివ్యాంగులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ర్యాంపు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

మద్యం విక్రేతపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళపై ఎస్సై జి.రాజు కేసు నమోదు చేశారు. దెయ్యాలతిప్ప పంచాయతీలోని వినాయకపురానికి చెందిన మోకా మంగమ్మ అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో ఆమె వద్ద నుంచి 7 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

దాతకు సత్కారం

ఉండి: ప్రముఖ దాత, రాజువేగేశ్న ఫౌండేషన్ అధినేత అనంతకోటిరాజు, ఆయన తండ్రి ఏసు రాజులను కలిగొట్ల గ్రామ రైతులు ఆదివారం సత్కరించారు. గ్రామంలోని వెంకయ్య వయ్యేరుపై బ్రిడ్జ్ నిర్మాణం కోసం ఆర్థికంగా సహకరించిన దాతను ఈ సందర్భంగా సత్కరించినట్లు రైతులు తెలిపారు. దాతల సహకారం మరువలేనిదని, బ్రిడ్జ్ నిర్మాణంతో 7 కిలో మీటర్ల దూరం తగ్గడంతో చాలా సంతోషిస్తున్నామని రైతులు తెలిపారు. తాము చేసిన సహాయం రైతులకు ఉపయోగపడటం చాలా సంతోషంగా ఉందని దాత అనంతకోటిరాజు అన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

145 మందికి కంటి పరీక్షలు



పాల్గొన్న లయన్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఆదివారం కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాత జిల్లా డిప్యూటీ గవర్నర్ పదం కుమార్ గుప్తా సహకరించారు. 145 మందికి కంటి పరీక్షలు చేశారు. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 17 మందిని నిడదవోలు ఆసుపత్రికి పంపారు. 23 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు అందించేందుకు నిర్ణయించారు. బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, రీజియన్ చైర్‌పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్, అధ్యక్షుడు వంగపండు రామోహన్‌రావు, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు హాజరయ్యారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



జలాభిషేకం చేసేందుకు బిందెలతో బారులు తీరిన మహిళలు

ఆకివీడు: కొల్లేరు తీరంలోని గ్రామ దేవతల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని కాళింగ గూడెం గ్రామ దేవతలుగా పూజిస్తున్న గంగానమ్మ, పెద్దింటి అమ్మవారిజాతర సందర్భంగా మహిళలు పెద్దఎత్తున బిందెలతో ఊరేగుతూ ప్రదర్శనగా అమ్మవార్లకు జలాభిషేకం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటా ఆనందోత్సాహాలతో మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునేందుకు ముర్రాట పాటను సనపల రాధాకృష్ణ రూ.70,500లకు పాడుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామంలోని తూర్పువైపున ఉన్న గంగానమ్మకు గ్రామ ఆడపడుచులు, మహిళలు పసుపునీళ్లతో నింపిన బిందెలతో ప్రదర్శనగా వెళ్లి జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామానికి పడమరవైపున ఉన్న పెద్దింటి అమ్మవారికి ప్రదర్శనగా వెళ్లి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వివిధ శక్తి వేషాలతో గ్రామోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి గ్రామానికి వచ్చి ఆడపడుచులు, బంధువులు, స్థానికులతో పండుగ వాతావరణంలో గ్రామం సందడి సందడిగా కన్పించింది.

దంతాల్ని సంరక్షించుకోవాలి

ఆకివీడు: దంతాల్ని సంరక్షించుకోవాలని ప్రముఖ దంత వైద్యులు సూచించారు. స్థానిక షాదీఖానాలో లయన్స్ ఆదర్శ క్లబ్, విష్ణు డెంటల్ ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత దంత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో దంత వైద్యులు కె.చైతన్య రామ్ మాట్లాడుతూ దంతాల పట్ల తగిన శ్రద్ధ కనబర్చాలన్నారు. పంటి నొప్పులు, పిప్పి పళ్ళను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పంటి లోపాలతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉందన్నారు. లయన్స్ ప్రతినిధి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌ల వైద్య శిబిరాల్ని, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు ఎంతో శ్రమతో మన ఇంటి వద్దకు వచ్చి వైద్యం అందజేస్తుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. దంత పరీక్షలు చేయించుకుని, లోపాల్ని ఎప్పటికప్పుడు సరిజేసుకోవాలన్నారు. ఆదర్శ క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో ఆధునిక పరికరాలతో చికిత్స అందిస్తున్నామన్నారు. దంత ఆసుపత్రులకు వెళ్లితే వేలకు వేలు వెచ్చించాల్సి వస్తుందన్నారు. శిబిరంలో సుమారు 260 మందికి పంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బిలాల్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జక్కీ,, లయన్స్ ప్రతినిధులు అహ్మద్, శ్రీనివాసరాజు, డీవీ సత్యనారాయణ, రంగారెడ్డి, వంశీరెడ్డి, దాట్ల రామరాజు, మణి, అయ్యర్ వాసు, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

24న ఎస్ఆర్‌కేఆర్‌లో విద్యార్థి సింపోజియం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన ఈనెల 24వ తేదీన సంకేత 2కె 24 పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఇటీవల అన్ని రంగాల్లోనూ విరివిగా ఉపయోగిస్తున్న డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ పి.రామమూర్తి రాజు, డాక్టర్ ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మను దర్శించుకున్న పీవీఎల్



అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: పెదపుల్లేరులో వేంచేసియున్న సత్తెమ్మ 59వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు 108 కలశాలలో పంచామృతాలతో గ్రామానికి చెందిన ఆడపడుచులు భారీ ఊరేగింపు నిర్వహించారు. గరగ నృత్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పులతో నిర్వహించిన కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి గాంచిన సత్తెమ్మ అమ్మవారి జాతరకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఎంతో మంచి చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి పనులే త్వరలో మరోసారి అమ్మవారి ఆశీస్సులు, ప్రజల దీవెనలతో అధికారంలోకి వస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: పేదలకు సహాయం చేయాలన్నది నేవాల వెంకన్న మెమోరియల్ ట్రస్టు ఆశయమని ట్రస్టు చైర్మన్ కాపు వీర్రాజు చెప్పారు. స్థానిక సిద్ధాపురం రోడ్డులోని ట్రస్టు కార్యాలయం వద్ద ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం, సహాయం అందించడం ఒక వరం అన్నారు. గత కొన్నేళ్లుగా తమ ట్రస్టు పేదలకు వివిధ రూపాల్లో సేవలందిస్తుందని తెలిపారు. 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేవాల ప్రసాద్, వానపల్లి పెద్దిరాజు, కాపు గోపాలకృష్ణ, వానపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై జి.రాజు తన సిబ్బందితో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. 13 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,700 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.